


ఓం నమోభగవతే శ్రీరమణాయ

# రమణ భాస్కర



సంపుటి : 4 సంచిక : 32 పుష్పం : 38 ఎడిటర్ : శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-2-99, గణపవరం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

మన దైనందిన జీవితంలో తెలివి అవసరం. తెలివి వలన ఆత్మవిశ్వాసం వస్తుంది. ఆత్మవిశ్వాసం వస్తే క్రమశిక్షణ వస్తుంది. క్రమశిక్షణ వస్తే లోకంలో బాధ్యతగా జీవిస్తాము. ఏదో రోజున జీవుడు శరీరాన్ని విడిచిపెట్టి వెళ్లిపోతాడు. చావు వచ్చేస్తుంది అని కంగారుపడవద్దు, భయపడవద్దు. దేహప్రారబ్దం అయ్యేవరకు జీవుడు దేహాన్ని అంటిపెట్టుకొని ఉంటాడు. ఈ లోపు మీరు కంగారు పడినా చావు రాదు. అందుచేత దాని గురించి భయపడనక్కరలేదు. దేహప్రారబ్దం అయిన తరువాత జీవుడు ఆ దేహాన్ని విడిచి వెళ్లిపోతాడు. ఎందుకు పనికిరానిది మరణం. అందువలన దాని గురించి భయపడవద్దు, రావలసిన టైము వచ్చినప్పుడు అది వస్తుంది. అది పెద్ద విశేషం కాదు. దేహం పోయిన తరువాత మరల ఇంకో దేహం వస్తుంది గాని మోక్షం రాదు. మోక్షసముపార్జన కోసమే ఈ జ్ఞానయజ్ఞాలు. మనం భగవంతుని ఉపాసన చేయటం ఎందుకంటే ఏకాగ్రత కోసం, పవిత్రత కోసం. మన స్వరూపం నుండి మనం జారిపోతే దేహధర్మాలు వచ్చేస్తాయి. అంటే కామం, క్రోధం, అన్నీ వచ్చేస్తాయి. నిరంతరము భగవంతుని రూపాన్ని ధ్యానిస్తూ ఉంటే, నామాన్ని స్మరించుకొంటూ ఉంటే ఆరోజుకారోజు మనం పవిత్రులమవుతాము.

భక్తి అనేది మన హృదయాంతరాళముల నుండి వచ్చేది గాని ధనం పెట్టి కొనుక్కొనేది కాదు. ధనం ఉంటే బజారులో ఉన్న వస్తువులను కొని స్వామికి అర్పించవచ్చు. డబ్బుతో కొనగలిగేవి డబ్బుతో వస్తాయి కాని డబ్బు వలన అన్నీ రావు. డబ్బు ఉంది అని భక్తి రాదు, శాంతి రాదు. ప్రేమ రాదు, మోక్షం రాదు. జ్ఞానం వలన మోక్షం వస్తుంది. మీరు ఏమతంలో ఉన్నా, ఏ దేవుని ఆరాధించినా జ్ఞానం అనేది వివేకజనితం, సూక్ష్మబుద్ధిజనితం అంటే జ్ఞానం అనేది వివేకం నుండి, సూక్ష్మబుద్ధిలోనుండి ఉద్భవిస్తుంది. బాధ్యతతో మీరు పనిచేయటం వలన నీ ప్రవర్తన నుండి ఒక అపూర్వం పుడుతుంది. ఆ అపూర్వం వలన నీకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. మీరు పూజ చేస్తే అది కూడా భక్తే, మీరు చేసే పనిని ప్రేమగా చేస్తే అది కూడా

భక్తే. ఇది భక్తి, ఇది భక్తి కాదు, ఇది భౌతికమైనది, ఇది ఆధ్యాత్మికమైనది అని ఇలా విడదీసుకోవద్దు. మీరు ప్రేమగా, బాధ్యతగా చేసుకోండి అంతా ఆధ్యాత్మికం అవుతుంది. మీకు ఇష్టమైన మార్గంలో శ్రద్ధగా ప్రయాణంచేయండి, మీరు తరిస్తారు. ఎవరో ఏదో చేస్తున్నారు అని అనుకరణ వద్దు. నీవు కాని దానితో తాదాప్యం వద్దు. నీవు ఏదైతే అవునో దానితో తాదాప్యం పెట్టుకొంటే అదే అవుతావు.

మనం దేనిగురించి బెంగపెట్టుకోకూడదు, దేనిగురించి దుఃఖ పడకూడదు. మన డ్యూటీ మనం చేయాలి. డ్యూటీ నుండి తప్పించుకోవటానికి ప్రయత్నం చేయకూడదు. పని హృదయపూర్వకంగా చేయాలి, కపటం లేకుండా చేయాలి. మనలో ఉన్న కపటమే మనకు జ్ఞానం రాకుండా అడ్డువస్తోంది. ఇది తెలియటానికి శ్రవణం అవసరం, శ్రవణం చేయకపోతే ఎలా తెలుస్తుంది. కొన్ని సంవత్సరాలు సంభాషించటం వలన తెలియని విషయం మహాత్ముల మౌనం వలన మీహృదయంలో ఉన్నవస్తువు ఒక్క క్షణంలో మీకు స్ఫురిస్తుంది. ఏవాక్యం అయితే సత్యమును సూచిస్తుందో దానిని ప్రమాణం అంటారు. భగవంతుడు చెప్పిన మాటను, శాస్త్రములో చెప్పిన మాటను ప్రమాణంగా తీసుకోవాలి. నేను బ్రహ్మమును, నేను బ్రహ్మమును అంటున్నావు. నీవు బ్రహ్మమే కాని ఆ నేను తీసివేస్తే బ్రహ్మము మిగులుతుంది అన్నారు భగవాన్.

రమణమహర్షిలాగ, దక్షిణామూర్తిలాగ, కృష్ణుడిలాగ ప్రపంచం దయగా ఉంటుంది అని అనుకోకండి. ప్రపంచంలో క్రూరత్వం ఉంటుంది, కఠినత్వం ఉంటుంది. భగవంతుడు ఎంత దయాస్వరూపుడో లోకం అంత క్రూరత్వంగా ఉంటుంది. మనం ఏమి చేస్తున్నాము అంటే దయగలస్వామిని వదిలేసి ప్రపంచమును పట్టుకొని తిరుగుచున్నాము. ప్రపంచం కఠినమైనది అందువలన నీవు తెలివిగా బ్రతుకు. నీవు తెలివిగా బ్రతికితేనేగాని ప్రపంచం యొక్క క్రూరత్వం నుండి, కఠినత్వం నుండి బయటకురాలేవు. నీవు జీవించు, లోకం ఎటువంటిదో తెలుసుకొని జీవించు, వివేకంతో జీవించు. నీకు అధికారం ఉంటే లోకం అంతా నిన్ను పూజిస్తుంది, అధికారం పోయిన వెంటనే నీతో మాట్లాడదు. నీకు ధనం లేకపోతే అక్కచెల్లెళ్ళు, అన్నదమ్ములు వదిలేస్తారు. వారిని విమర్శించటం కాదు లోకం పోకడ అది. ఎక్కడ దయ ఉందో అక్కడ పాపం ఉండదు, ఎక్కడ కఠినత్వం ఉందో అక్కడ పాపం ఉంటుంది. దేహం ఉన్నంత సేపు ఎక్కడో ఒకచోట జీవించాలి కాబట్టి లోకం ఎటువంటిదో తెలుసుకొని జీవించు. లోకం యొక్క కఠినత్వంలో, లోకం యొక్క మాయలో పడకుండా నీ తెలివిని ఉపయోగించుకొంటూ .జీవించాలి. అలా జీవిస్తూ స్వామిని పొందాలి.

ధనం మీద ఉన్న వ్యామోహం వలన భగవంతుని మాట యొక్క విలువ మనకు

తెలియటంలేదు. ఈశ్వర సంకల్పము బలీయమైనది. మన సంకల్పాలు యెన్నో వ్యర్థమవుతాయి గాని ఈశ్వర సంకల్పం వ్యర్థం అవ్వటానికి వీలు లేదు అది జరిగి తీరవలసిందే. కర్తలేని కర్మను చేసేవాడు బుద్ధిమంతుడు. అంటే తన ద్వారా పనిజరుగుతూ ఉండాలి. నేను చేస్తున్నాను అనే భావన అక్కడ ఉండకూడదు. జ్ఞాని అంటే చైతన్యం. నీ హృదయంలో ఉన్న చైతన్యం నీ తెలివి వలన తెలియబడదు. ఈశ్వరానుగ్రహం వలన తెలియబడుతుంది. మానవుడికి అసాధ్యం ఉంటుంది గాని ఈశ్వరునికి అసాధ్యం అంటూలేదు. కుంటివాడిని నడిపించగలడు, మూగవాడిని మాట్లాడించగలడు. ఆయనకు ప్రతీదీ సాధ్యమే. భగవంతుడు మీ కోరికలు నెరవేర్చగలడు కాని ఒకోసారి ఆపుచేస్తాడు. మీరు బాగు పడ్డాక, మీ మనస్సు సంస్కరింపబడ్డాక అప్పుడు మీ కోరికలు నెరవేరుస్తాడు లేకుంటే మీరు పతనమయ్యే ప్రమాదం ఉంది. కొంత టైము పడుతుంది, సహనం అవసరం.

భగవంతుడు అంతటా ఉన్నాడు, నీ హృదయంలోనూ ఉన్నాడు. అందరి హృదయాలలోను ఉండి జీవకోటి యొక్క దేహప్రారబ్ధాన్ని బట్టి ఆడిస్తున్నాడు. ప్రారబ్ధం విడిచి పెట్టిన బాణం లాంటిది. ప్రారబ్ధం అనుభవించాక దేహం చనిపోతుంది. దానితో తాదాప్యం చెందకు. ఇతరుల నేత్రాలతో చూడకు నీ నేత్రాలతో చూసుకో అంటే సొంతబుద్ధిని విడిచిపెట్టకు. నీవు సాధన చేస్తూ ఉన్నా మాటమాటకు ఇష్టాలు, అయిష్టాలు వచ్చి పొంగిపోతూ, కృంగిపోతూ ఉంటే రైలు గమ్యంచేరకుండా ప్రయాణం మధ్యలో దిగిపోయినట్లు. ఇలా ఉంటే నీ సాధన ఎలా అభివృద్ధి అవుతుంది. మనలను ఎవరైనాపొగుడుతూఉంటే అది మన మీద అభిమానంతో మనలను పొగుడుతున్నారుగాని ఆ పొగడ్తకు సంబంధించిన శక్తి మీకు లేదని గ్రహించాలి. మీలో లేని అర్హత, మీలో లేని యోగ్యత, మీలో లేని పవిత్రత ఎవరైనా ఆరోపించినా అందులో కలిసిపోకండి. ఇతరుల మాటలలో పడిపోతే మీరు గమ్యాన్ని మర్చిపోతారు. తెలివి ఉన్నవారికంటే మంచి హృదయం ఉన్నవారు ముందుగా భగవంతుని పొందుతారు.

మౌనం అన్నింటి కంటే శక్తి వంతమైనది. మనస్సు ఎక్కడయితే ఉదయిస్తుందో అక్కడకు వెళ్ళి అది అణగాలి. అప్పుడు నీకు మౌనస్థితి కలుగుతుంది. అప్పుడు నీకు తెలియకుండానే నీ ఉపాధి ద్వారా కాంతి తరంగాలు, శాంతి తరంగాలు నీ పరిసరాలను వర్షం తడిపినట్లు తడుపుతాయి. మాటకూ శక్తి ఉంది, మౌనానికి శక్తి ఉంది కాని మాటయొక్క శక్తి కంటే మౌనం యొక్క శక్తి అత్యంత బలీయమైనది. లోకం యొక్క వాక్యం ప్రమాణం కాదు, ఈశ్వరుడు చెప్పిన వాక్యం ప్రమాణం. ఒక వేళ నీకు ఆ వాక్కు దొరకకపోతే మహర్షులను ఆశ్రయించి వారిని సంతోషపెట్టి ఆ వాక్యం తెలుసుకొని తరించు అని గీతలో భగవంతుడు చెప్పాడు.

రామకృష్ణుడు ఏమి చెప్పాడు అంటే మీ ఇంట్లో పనిచేసే పని మనిషే మీకు గురువు అని చెప్పాడు. పనిమనిషి మీ ఇల్లు తుడుస్తుంది, మీ గిన్నెలు తోముతుంది, మీ ఇంట్లో పిల్లలను ఎత్తుకుంటుంది. అంతా బాగానే చేస్తుంది గాని హృదయాంతరాళములో ఇది అంతా నాదికాదు అని ఆమెకు తెలుసు. మీరు కూడా మీ ఇంట్లో అలా బ్రతకండి. మీ ఇంట్లో ఉన్నది అంతా మీది కాదు దేవుడిదే. మీ ఇంట్లో మనుషులు కూడా మీ వాళ్ళుకాదు దేవుని వారే. మీరు సంతోషించండి, ఎంజాయ్ చెయ్యండి మీది అనుకొని సంతోషించవద్దు, అంతా దేవునిదే అనుకొని సంతోషించండి. మీ ఇంట్లో పనిమనిషి ఎలా జీవిస్తోందో అలాగ మీరు కూడా జీవించటం నేర్చుకొంటే మీరు తరిస్తారు. ఈలోకం పరమేశ్వరుడిదే. మీరు దేవుని ఎలా పూజిస్తున్నారో లోకాన్ని కూడా అలా పూజించండి. లోకంలో కఠినత్వం ఉంటే ఉండనివ్వండి. అందులో కలవవద్దు. మీకు లోకం ప్రమాణం కాదు.

బ్రిస్టల్ వారు గురువు గురించి వ్రాస్తూ నీవు మమ్మల్ని నోట్లో వేసుకొన్నావు, నములుతున్నావు, మింగటానికి మమ్మల్ని తయారుచేస్తున్నావు. కాని మింగేటప్పుడు మాకు నొప్పి లేకుండా చెయ్యి అని వ్రాసారు. గురువు అంటే రూపం కాదు. ఎక్కడయాతే భయం లేదో, ఎక్కడయితే అసూయ లేదో, ఎక్కడయితే దురాచారం లేదో, ఎక్కడయితే పునర్జన్మ లేదో అక్కడికి మిమ్మల్ని తీసుకొని పోవటానికి గురువు ప్రయత్నం చేస్తాడు. ఎక్కడకు వెళ్ళిన తరువాత తిరిగి రావలసిన పని లేదో అక్కడకు తీసుకొని వెళ్ళటానికే గురువు గురిపెడతాడు. గురువు మాటగాని, చేతగాని, చూపుగాని నువ్వు గాని ఏదైనా నీ హృదయంలో ఉన్న వస్తువు దగ్గరకు తీసుకొని వెళ్ళటానికే. ఆయనకు లౌకిక ప్రయోజనం ఏమీలేదు. భగవాన్‌కు కేన్సర్ వచ్చింది. ఒకసారి ఆయన మాటల సందర్భంలో అక్కడ కూర్చొన్న వారితో బాధ అంటే ఇలా ఉంటుందా అన్నారట. అయితే ఆయనకు కూడా బాధ తెలిసింది కదా ఎందుచేత బాధపడ్డాడు అని ఒక పండితుడు నన్ను అడిగాడు. ఆ బాధకూడా వారికి ఆనందమే. అది ఎలా ఉంటుంది అంటే మీకు వందకోట్లు లాటరీ వచ్చింది అనుకోండి. లాటరీ వచ్చింది అనే ఆనందంలో ఉండగా మీకు చీమ కుట్టింది అనుకోండి. దాని వలన వచ్చే బాధ ఈ ఆనందంలో కలిసిపోతుంది. మీకు లాటరీ వచ్చింది అనే ఆనందం గుర్తుకు వస్తుంది గాని చీమకుట్టిన బాధ గుర్తుకు రాదు. దాని వలన కూడా ఎంతో కొంత బాధ ఉంది గాని ఆ బాధ ఆనందంలో కలసిపోయింది. అలాగే జ్ఞానియొక్క దేహానికి ఏదైనా బాధవచ్చినా అదికూడా ఆనందంలో భాగమే అలా అర్థంచేసుకోవాలి. ఎంత పాండిత్యం ఉన్నా ఈశ్వరానుగ్రహం లేకపోతే ఆయన చెప్పిన మాట మన గుండెకు తాకదు.

Printed and published by P.S. Rama Raju at Shriram Graphics, Palakol ☎ 24776